క్లుప్తంగా

నిరాశ్రయులకు హక్కులు కల్పించాలి

రాజమహేంద్రవరం సిటీ: సాధారణ పౌరులతో సమానంగా నిరాశ్రయులకు హక్కులు కల్పించాలని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలో 200 మంది వృద్ధులు, మహిళలు, నిరాశ్రయులతో కలిసి ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిరాశ్రయుల కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో సుమారు ఐదు వేల మందికి పైబడి నిరాశ్రయులు తలదాచుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో నిరాశ్రయుల కేంద్రం మేనేజర్ ఎద్దు హరికృష్ణ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

సారాబట్టీలపై విస్తృత దాడులు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో ఎస్ఈబీ, పోలీసు సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ పి.సోమశేఖర్ పర్యవేక్షణలో మంగళవారం తెల్లవారుజాము నుంచి గోదావరి పరివాహక ప్రాంతాల్లో లా అండ్ ఆర్డర్, ఎస్ఈబీ పోలీసులు సంయుక్తంగా సారాబట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 58 డ్రమ్ములలో నిల్వ ఉంచిన 10,400 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. సీతానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట లంకల్లో కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో పోలీసు, ఎస్ఈబీ సిబ్బంది దాడులు చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకల్లో ఇన్‌స్పెక్టర్ గణేష్ నేతృత్వంలో బృందాలు దాడి చేశాయి.

శిక్షణను వాయిదా వేయాలి

కంబాలచెరువు: దసరా సెలవులలో ప్రాథమిక ఉపాధ్యాయులకు రెండో విడతగా జరగనున్న ఫండమెంటల్ లిటరసి అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ తరగతులు వాయిదా వేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం ఉప విద్యాశాఖాధికారి ఈవీవీఎస్ఎన్ నారాయణను కలిసి విజ్ఞప్తి చేసింది. దసరా పండగ అనంతరం ట్రైనింగ్ షెడ్యూల్ ఇవ్వాలని కోరింది. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, కోశాధికారి ప్రసాద్, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

రచ్చబండకు పలు వినతులు

రాజమహేంద్రవరం రూరల్: వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్స్‌లోని ఎంపీ కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమానికి పలువురు వినతులు అందజేశారు. అప్పు తీసుకుని తిరిగి ఇవ్వలేదని, ఇల్లు కడతానని చెప్పి డబ్బులు తీసుకుని మేస్త్రి ముఖం చాటేశాడని, జీవనాధారం కల్పించాలని, పెన్షన్ల కోసం, సీఎం సహాయ నిధి కోసం, ట్రై సైకిల్ కావాలని, కుటుంబ సమస్యలు, కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయించాలని..ఇలా అనేక అర్జీలను ఎంపీ భరత్ రామ్‌కు అందజేశారు. ఆయన వారి సమస్యలను ఓపికగా తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడి కక్కడే పరిష్కరించారు. అనంతరం ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లక్ష్యమన్నారు. 2024 ఎన్నికలలో మరోసారి జగనన్న సీఎం కావడం ఖాయమన్నారు.

బాలికను కాపాడిన దిశ పోలీసులు



కాపాడిన బాలికతో దిశ పోలీసులు

కంబాలచెరువు: తల్లి మందలించిందని అలిగి గోదావరి తీరానికి వచ్చిన ఓ బాలికను దిశ పోలీసులు కాపాడారు. రాజవోలు గ్రామానికి చెందిన కొమ్మారపు వినీత ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా ఆటోలో స్థానిక గౌతమ ఘాట్ వద్దకు వచ్చి కూర్చుంది. ఆ సమయంలో అక్కడ ఉన్న దిశ మహిళా పోలీసు మంగాలక్ష్మికి ఆ బాలికపై అనుమానం కలిగింది. ఆమె వద్దకు వెళ్లి ప్రశ్నించగా పొంతన లేని మాటలు చెబుతోంది. దీంతో వినీతకు పోలీసులు కౌన్సెలింగ్ చేశారు. తల్లి తిట్టడంతో మనస్తాపం చెంది ఇక్కడకు వచ్చానని ఆమె పోలీసులకు తెలిపింది. వివరాలు తెలుసుకున్న పోలీసులు తల్లికి ఫోన్ చేశారు. ఆ బాలిక అన్న, తమ్ముడు రావడంతో వినీతను వారికి అప్పగించారు.

టీడీపీ నేతల సర్వమత ప్రార్థనలు

సీటీఆర్ఐ: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల కావాలని ఆకాంక్షిస్తూ టీడీపీ సిటీ నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. తిలక్ రోడ్డులోని రామసాయి మందిరం ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, దానవాయిపేట మసీదులో దువా, చర్చిపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్, కాశి నవీన్ కుమార్, కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఆరోగ్యానికి రక్ష

- డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు
- పలువురికి వైద్య సేవలు



కొలమూరులో మందులు పంపిణీ చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు



జేగురుపాడులో కళ్లజోళ్లు అందిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్ష అని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. కోలమూరు–3 గ్రామ సచివాలయం పరిధిలోని ఈఏఆర్ ఎయిడెడ్ స్కూల్లో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 506 మందికి వైద్య సేవలు అందించారు. 24 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె.సుధాకర్ సచివాలయ కన్వీనర్లతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఆకుల వీర్రాజు సందర్శించి రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. ఆఫ్తాలజీ అసిస్టెంట్ స్వప్న పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ నేతృత్వంలో డాక్టర్లు లిడియా సుచిత్ర, ఈ.నాగదుర్గ, జగదీష్ కృష్ణ రోగులకు వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మేరీ నేతృత్వంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కోలమూరులో శిబిరాలు ముగిసిన సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, మాజీ ఉప సర్పంచ్ చెరుకూరి సత్యనారాయణ, ఈఏఆర్ ఎయిడెడ్ స్కూల్ సంస్థల కరస్పాండెంట్ కోలమూరు ప్రభాకరరావు, కొంతమూరు సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యుడు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, సచివాలయ కన్వీనర్లు గాబ్రియేల్, టీటి ప్రసాద్, ఆనందరావు, పార్టీ నాయకులు ఎంఎం అలీ, షేక్ చానా, పరిమి దుర్గారావు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం జగన్ కృషి

కడియం: రాష్ట్రంలో ప్రజారోగ్యం పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. జేగురుపాడు సచివాలయం 2 పరిధిలో రెండోరోజు మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చందన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ సేవలను విస్తృతం చేయడంతో పాటు, అవసరమైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్యసదుపాయం అందిస్తున్నారన్నారు. అనంతరం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో 610 మందికి వైద్య పరీక్షలు జరిపారు. డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో పీడియాట్రిక్, గైనిక్, జనరల్, ఆప్తమాలజీ తదితర విభాగాలకు చెందిన వైద్య బృందం సేవలు అందించింది. శిబిరాన్ని డీఎంఅండ్‌హెచ్ఓ కె.వెంకటేశ్వరరావు సందర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, ఎంపీటీసీ ఆకుల సుధాకర్, ఎంపీడీవో కె.రత్నకుమారి పాల్గొన్నారు.



జేగురుపాడులో రోగుల రిజిస్ట్రేషన్ తీరును పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు

శిబిరాలను వినియోగించుకోవాలి



శంభూనగర్ వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ అనసూరి పద్మలత

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. స్థానిక శంభూనగర్ యూపీహెచ్‌సీలో మంగళవారం జరిగిన శిబిరాన్ని ఆమె సందర్శించారు. అనంతరం రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న, నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, సెక్రటరీ ఎస్.సత్యవతి పర్యవేక్షించారు. స్పెషలిస్టు వైద్యులు ప్రణీత్ రెడ్డి, ఆప్తాలిజిస్ట్ పి.భాగ్యశ్రీ, గైనకాలజిస్ట్ అనూష, వైద్యులు టి.మనోజ్, అశోక్‌చంద్ర, మాణిక్యాంబ, దేవీ ప్రియాంక, సంధ్య వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ వి.నాగవేణి నేతృత్వంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. శిబిరంలో 651 మందికి వైద్య సేవలందించగా, 24 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు సిఫారసు చేశారు.

మోరంపూడి ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

- ఎంపీ భరత్ రామ్
- రాజ్యసభ సభ్యుడు బోస్‌తో కలిసి పనుల పరిశీలన



మోరంపూడి బ్రిడ్జి పనులపై కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు బోస్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి ఫ్లైఓవర్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థ నిర్వాహకులకు ఎంపీ భరత్ రామ్ స్పష్టం చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్ర బోస్‌తో కలిసి మంగళవారం ఆయన ఆ పనులను పరిశీలించారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ సర్వీసు రోడ్లను ఇప్పటి వరకూ ఎందుకు పూర్తి చేయలేదని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. అవి పూర్తి కాకుంటే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నా ఎందుకంత నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. గ్రావెల్, ఆర్ఈ ప్యానెల్, గెడ్డర్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు..ఇలా ఒకటొకటిగా పరిశీలిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జనవరి మొదటి నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి తీరాలని స్పష్టం చేశారు. అవసరమైతే డే అండ్ నైట్ షిఫ్ట్ ప్రకారం పనులు చేయాలని సూచించారు.

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

ఎంపీ భరత్ రామ్ విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ – విశాఖపట్నాలకు మధ్యలో నగరంలోని జాతీయ రహదారిపై ఉన్న మోరంపూడి జంక్షన్‌లో తరచూ ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో ఫ్లైఓవర్ ఆవశ్యకతను వివరించి కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించామన్నారు. గతంలో టీడీపీ హయాంలో మంజూరైనా, అప్పటి నాయకులు శ్రద్ధ చూపకపోవడంతో కేన్సిల్ అయ్యిందన్నారు. మొత్తానికి మోరంపూడి ఓఫ్‌ఓబీ నిర్మాణ పనులు శరవేగంగానే జరుగుతున్నాయన్నారు, మరో మూడు నెలల్లో నిర్మాణం పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. తమ మార్గాని ఎస్టేట్స్ గ్రౌండ్‌ను ఖార్ఖానా పనుల కోసం ఉచితంగా ఇచ్చామన్నారు. ఎఫ్‌ఓబీకి సంబంధించి మేజర్ పనులు పూర్తయ్యాయన్నారు. ఆయన వెంట పార్టీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళాఅధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మార్గాని సురేష్, బొప్పన సుబ్బారావు, చీరా రాజు, మజ్జి అప్పారావు, అన్నపూర్ణ రాజు పాల్గొన్నారు.

ఘనంగా కారుణ్యానంద స్వామి జయంతి



స్వామి జయంతిలో మాట్లాడుతున్న కొండబాబు

సీటీఆర్ఐ: గౌతమీ జీవ కారణ్య సంఘం వ్యవస్థాపకుడు కారుణ్యానంద స్వామి జయంతిని నారాయణపురంలోని గౌతమీ జీవకారుణ్య సంఘం ఆశ్రమ ప్రాంగణంలో మంగళవారం పాలక మండలి ఛైర్మన్ బర్రే కొండబాబు, ట్రస్ట్‌బోర్డ్ డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బర్రే కొండబాబు మాట్లాడుతూ కారుణ్యానంద స్వామి అసలు పేరు సుబ్బారావు చౌదరి అని, ఆయన వేట్లపాలెం గ్రామానికి చెందినవారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారికి మొదటిసారి సంఘం బాధ్యతలు అప్ప చెప్పడం చారిత్రాత్మక నిర్ణయమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ భరత్ రామ్, స్థానిక పార్టీ పెద్దలు తనపై నమ్మకం ఉంచి ఛైర్మన్‌గా ఎన్నిక చేసినందుకు అందరినీ కలుపుకొని సేవాభావంతో బాధ్యతలు నిర్వహిస్తానన్నారు. స్వామి వర్ధంతి రోజు 8వ తేదీ నుంచి జయంతి పదో తేదీ వరకూ మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అందుకు సహకరించిన దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మి, ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లు అడపా రఘు, బత్తిన అన్నవరం, పిల్లి నాగేంద్ర ప్రసాద్, చల్లంగి ఏడుకొండలు, నాగులాపల్లి దేవి, లక్ష్మణరావు, చిట్టాబత్తుల అనంత లక్ష్మీరాజు, తమ్మిశెట్టి రాధిక ప్రభాస్, కార్యాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సుందర నగరంగా రాజమహేంద్రవరం



సమస్యలను పరిశీలిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని సుందరంగా తయారు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 2వ డివిజన్ కేఎస్ఎన్ ఇండోర్ స్టేడియం వద్ద సుమారు రూ.20 లక్షల అంచనాతో నిర్మించనున్న 220 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి మానే దొరబాబు, ఇన్నీసుపేట అర్బన్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు గేడి అన్నపూర్ణ రాజు, నాయకులు నక్కెళ్ల బాబూరావు, రాయుడు గణేష్ పాల్గొన్నారు.

45వ డివిజన్‌లో పర్యటన

క్వారీ మార్కెట్ ప్రాంతంలోని గాదిరెడ్డి నగర్, ఇందిరా నగర్ ప్రాంతాలు డ్రైనేజీ నీటితో ముంపునకు గురవుతున్నాయని, చర్యలు చేపట్టాలని స్థానికులు సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన మంగళవారం 45వ డివిజన్లో ఇన్‌చార్జి కస్సే రాజేష్ ఆధ్వర్యంలో పర్యటించారు. పలు సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్చించారు. ఇందిరా పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. ఆయన వెంట సిర్రా రాజ్ కుమార్, తగరం సురేష్, ఓంకార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బ్లాక్ స్పాట్‌లలో అభివృద్ధి పనులు చేపట్టాలి
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎంపీ భరత్, ఎస్పీ జగదీష్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 17 బ్లాక్ స్పాట్‌లను ప్రమాద ప్రాంతాలుగా గుర్తించామన్నారు. వాటివద్ద ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని విద్యాసంస్థల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని ఆ ప్రాంతాలను తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లను టీడీసీ, పోలీస్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, విద్యుత్, తదితర అధికారులు ఉమ్మడిగా తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో జేసీ ఎస్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, జిల్లా రవాణా అధికారి కేవీ కృష్ణారావు, నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సురేంద్రబాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్‌వీబీ రెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

కేంద్ర ప్రభుత్వం ఒక జిల్లా ఒక ఉత్పత్తికి ప్రోత్సాహం అందించే నేపథ్యంలో జిల్లాలోని పులుగుర్త కాటన్ ఫ్యాబ్రిక్స్‌ను ప్రతిపాదించారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో పులుగుర్త కాటన్ ఫాబ్రిక్‌ను పరిశీలించేందుకు మంగళవారం న్యూఢిల్లీ నుంచి జిల్లాకు కేంద్ర బృందం పరిశీలకులు ఇన్వెస్టు ఇండియా టీమ్ ప్రతినిధి హరప్రీత్ సింగ్ విచ్చేశారు. ఆయన కలెక్టర్ మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కలెక్టర్ చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కె.పెద్దిరాజు ఉన్నారు.

పారిశుధ్య మెరుగుకు సమన్వయం అవసరం



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పారిశుధ్యం మెరుగుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక 9, 10 డివిజన్లలో పారిశుధ్య పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కాలువల్లో సిల్ట్‌ను ఎప్పటి కప్పుడు తొలగించాలని సూచించారు. ఏకేసీ కాలేజీ వద్ద గల పార్కును సందర్శించి, జరుగుతున్న పనుల ప్రగతిని సమీక్షించారు. ఆయన వెంట ఎస్ఈ జి.పాండురంగారావు ఉన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అర్జీల పరిష్కారం

ప్రాధాన్యతా క్రమంలో స్పందన అర్జీలను పరిష్కరిస్తున్నామని కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో విద్యుత్ కాలనీ వాసులు అందజేసిన అర్జీపై మంగళవారం క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్, ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాలనీలో అంతర్గత కాలువల సమస్య చాలాకాలంగా ఉందన్నారు. కాలువల నిర్మాణానికి అవరోధంగా ఉన్న ఆక్రమణలు తొలగించేందుకు అడ్డంకులు ఉండేవన్నారు. అటువంటి సమస్యలన్నీ పరిష్కరించామని, కాలువలు నిర్మించడానికి అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అధికారులు వేధింపులు మానుకోవాలి



నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: కాలం చెల్లిన కంప్యూటర్లు, ప్రింటర్లను మార్చకుండా, తగిన నెట్‌వర్క్ సదుపాయం కల్పించకుండా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించడం తగదని రాజమండ్రి తపాలా డివిజన్ గ్రూప్ సి యూనియన్ కార్యదర్శి బి.కొండబాబు ధ్వజమెత్తారు. పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం పోస్టల్ డివిజనల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పోస్టుమెన్ యూనియన్ కార్యదర్శి జె.సతీష్ మాట్లాడుతూ ఉత్తరాలు బట్వాడా సమాచారాన్ని పోస్టుమెన్లు తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా ఆన్లైన్ అప్డేట్ చేయాలని వేధించడం, అధికారులు నిర్దేశించిన బట్వాడా లక్ష్యాలను పూర్తి చేయలేని ఉద్యోగులను కక్షపూరితంగా వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ తపాలా ఉద్యోగుల జిల్లా కార్యదర్శి ఆర్.పుష్కరం మాట్లాడుతూ టార్గెట్ల పేరుతో జీడీఎస్ ఉద్యోగులను వేధించడం మానుకోవాలన్నారు. అనంతరం పోస్టల్ సూపరింటెడెంట్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు యాజీ ప్రకాష్, ఐ.శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యం

సీతానగరం: జగన్ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. రాపాకలో నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా కులవృత్తులు చేసుకునే వారికి ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఆలయ ట్రస్ట్‌బోర్డులలో కూడా అవకాశం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తాము ఇచ్చిన హామీ మేరకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నాలుగు సెంట్ల స్థలం కేటాయించడం జరిగిందన్నారు.

‘ప్రియదర్శిని’లో న్యాయవిజ్ఞాన సదస్సు



ప్రియదర్శిని ఆశ్రమంలో బధిరులతో భోజనం చేస్తున్న న్యాయమూర్తి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పాల్గొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల హక్కులు, నల్సా మానసిక వికలాంగులకు న్యాయ సేవల పథకాలు, 2015, 2021 ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ తేడాలను వివరించారు. అనంతరం ఆశ్రమంలోని బధిర విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. న్యాయమూర్తి మాటలను బధిర విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయురాలు, ఆశ్రమ ప్రిన్సిపాల్ కె.ఆశాలత తర్జుమా చేసి సైగలతో వివరించారు. కార్యక్రమంలో ఐఆర్‌సీఏ డైరక్టర్ సుందరరాజ్, ఆశ్రమ నిర్వాహకులు కె.స్వప్న వర్మ, ప్రేమలత, నిర్మల పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో....

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు అందరూ బాలహక్కుల పై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ స్కూల్లో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. అడ్వకేట్లు జి.మోహన్ వంశీ, పి.రత్నశేఖర్, వి.విజయలక్ష్మి తదితరులు బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. పారా లీగల్ వలంటీర్లు ప్రశాంతి, ఎం.శ్రీను, పి.ప్రిస్కిల్లా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, వరహగిరి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో పేదల అభ్యున్నతి

- నగరంలో చురుగ్గా అభివృద్ధి పనులు
- ఎంపీ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. 40వ డివిజన్‌లోని ఆర్యాపురం టింబర్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్ వద్ద మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఎంపీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో సిటీ నియోజక వర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. నగరంలో ప్రతిపక్ష టీడీపీ ఎమ్మెల్యే ఉండటం వల్ల, ఆ పార్టీ నాయకులు కోర్టును ఆశ్రయించడం వల్ల పేదలకు నివాస స్థలాలు ఇవ్వలేకపోయామన్నారు. నగరాన్ని ఈ నాలుగున్నరేళ్లలో ఎంతో అభివృద్ధి చేశామని, మరోసారి అవకాశం కల్పిస్తే నగర రూపు రేఖలను సమూలంగా మార్చివేసి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రతి ఇంటింటికీ వెళ్లి వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. తనను ఎంపీగా, డాక్టర్ గూడూరిని ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ దుంగ మంగాలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, గేడి అన్నపూర్ణ రాజు, సప్పా ఆదినారాయణ, నందం స్వామి, రాజ శేఖర్, తగరం సురేష్ పాల్గొన్నారు.